ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు!

ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- అనుభవజ్ఞులైన టీచర్లతో బోధన
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- ర్యాలీలు, ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



కడ్తాల్‌లో బడిబాట సందర్భంగా ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలు మెరుగుపడుతుండటంతో మౌలిక వసతుల కల్పనకు అధికారులు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేకాక అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన చేయిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీనికి తోడు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రతి సంవత్సరం ఎస్ఎస్‌సీలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ప్రతిసంవత్సరం ప్రయివేటు పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజుల వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో చేర్పించడానికి ఉత్సుకత కనబరుస్తున్నారు. గత ప్రభుత్వంలో ‘మన ఊరు–మన బడి’ పథకం క్రింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కొంత మేర దృష్టి సారించింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం క్రింద పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అనేక వసతులు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధన చేస్తుండటంతో విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. పదోతరగతిలో అత్యుత్తమ మార్కులతో బాసర ట్రిపుల్‌ఐటీ లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో ప్రతి సంవత్సరం విద్యార్థులు సీట్లు సాధిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల బడిబాటలో



మైసిగండి బడిబాటలో ఎంఈఓ, నోడల్ అధికారి

భాగంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలు, విద్యాబోధన తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు...

మండల వ్యాప్తంగా 6 ఉన్నత, 1 కేజీబీవీ, 6అశ్రమ, 5ప్రాథమికోన్నత, 30కి పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. గతంలో మూత పడిన ప్రాథమిక పాఠశాలలు కూడా ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 2వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

పదిలో ఉత్తీర్ణత..

2023–24 విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్ష ఫలితాల్లో కడ్తాల్ మండలంలో మొత్తం 384మంది విద్యార్థులకు 358 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 93% మంచి ఫలితాలు వచ్చాయి. ఇందులో 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు విద్యార్థులు ఎస్ఎస్‌సీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియానికి సంబంధించి 114మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 105 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 72 మంది విద్యార్థినులకు 63 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. కస్తూరిబా గాంధీలో 38 మందికి 38 మంది పాసయ్యారు. ఏక్వాయిపల్లి ఉన్నత పాఠశాలలో 19 మందికి 19 పాసై 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. చరికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 25మందికి 25 పాసై, 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. రావిచేడ్‌లో 46 మంది విద్యార్థులకు 38 మంది ఉత్తీర్ణత సాధించగా, ముద్విన్ పాఠశాలలో 31మందికి 31 మంది, మైసిగండి గిరిజన అశ్రమ పాఠశాలలో 39 మందికి 39మంది ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



ప్రైవేట్ పాఠశాలల్లో వేలవేలకు ఫీజులు కట్టి చదివించే కంటే, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. అర్హత కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. – జంగయ్య, నోడల్ అధికారి, కడ్తాల్

నాణ్యమైన విద్యాబోధన



ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన చేయిస్తున్నారు. విద్యార్థులు అత్యుత్తమంగా రాణిస్తూ, మంచి మార్కులతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుండటంతో వసతులు, సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. బడిబాట ద్వారా ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. – సర్దార్‌నాయక్, ఎంఈఓ, కడ్తాల్

అక్రమ తవ్వకాలు ఆపాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చీపునుంతల ప్రజలు, రైతులు

తలకొండపల్లి: అక్రమ తవ్వకాలు ఆపి, మైనింగ్ పనులు నిలిపి వేయాలని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేశ్ డిమాండ్ చేశారు. వ్యవసాయ బోరు బావులు క్రుంగి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రంగారెడ్డికి గుజ్జుల మహేశ్ ఆధ్వర్యంలో చీపునుంతల గ్రామ ప్రజలు, రైతులు గురువారం వినతిపత్రం అందజేశారు. చీపునుంతల గ్రామంలో సర్వే నెంబర్ 22లో 42ఎకరాల భూమి ఉంది. అందులో 32ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అనుమతి గడువు పూర్తయిన తరువాత కూడా సంబంధిత వ్యక్తులు అక్రమ మైనింగ్ తవ్వకాలు చేపడుతున్నారని ఆ గ్రామ రైతులు వినతి పత్రంలో పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో బోరు బావులు క్రుంగి రైతులు తీవ్రంగా నష్ట పోవడమే గాకుండా సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరమేష్, బాయమ్మ, నిర్మలమ్మ, బాలమ్మ, వీరప్ప, యాదమ్మ, రమేష్, నారంజి, ఎల్లమ్మ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదోడికి సీపీఐ అండ

పార్టీ జాతీయ నేత పల్లా వెంకట్ రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారుల్లో వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించే పోరాటం చేసి ఆసరాగా నిలిచిన ఘనమైన చరిత్ర సీపీఐదేనని ఆ పార్టీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి ఆర్కే నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సీపీఐ ప్రజా బహిరంగ సభలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ రాజకీయాలు ప్రమాదంలో ఉన్నాయని ప్రజాస్వామ్యంలో ఓటును డబ్బు, మద్యం, లిక్కర్ మాఫియాతో పాటు మతం అనే మాధ్యం శాసిస్తున్నాయన్నారు. అత్యంత భయంకరమైన ఆయుధంగా మతాన్ని వాడుకుంటున్న బీజేపీ పాలన ఎక్కువ రోజులు కొనసాగదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్ నాయక్, వేణుగోపాల చారి, మల్లయ్య గౌడ్ ఉప్పలయ్య, జమీల, భరత్, గోపి, పాపయ్య, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నుంచి రక్షించండి

బీజేపీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి కుమార్



తలకొండపల్లిలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న కుమార్, తదితరులు

తలకొండపల్లి: వీధి కుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయని, వాటి నుంచి ప్రజలను రక్షించాలని బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైందని వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓతో చెప్పారు. వీధి కుక్కలతో భయపడి చిన్నారులు, వృద్ధులు, బయటికి వెళ్లాలంటే ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎటునుంచి ఏవైపుగా వచ్చి కాటేస్తాయో తెలియని దుస్థితి నెలకొందన్నారు. రాత్రి వేళల్లో బయటికి వెళ్లాలంటే యువకులు సైతం భయపడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఘు, శేఖర్, నరేశ్, రామకృష్ణారెడ్డి, పర్వతాలు, రాఘవేందర్, శ్రీనివాసులు, చందు, వంశీ, మహేష్, సుధాకర్ రెడ్డి, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌రెడ్డికి ఘన సన్మానం



శుభాకాంక్షలు తెలియజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇటీవల నవీన్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందిన విషయం తెలిసిందే. గురువారం శాసనమండలిలో ప్రమాణ స్వీకారం సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీనియర్ నేత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ హైదరాబాద్‌లో నవీన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు.

అల్లి చెరువు సందర్శించిన అధికారులు



అల్లి చెరువును సందర్శించిన అధికారులు

మంచాల: కబ్జాకు గురైన అల్లి చెరువును పరిరక్షించాలని మత్స్యకార్మిక సంఘం డిమాండ్‌కు స్పందించి గురువారం ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులను వారు నిలదీశారు. అల్లి చెరువును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మత్స్య కార్మిక సంఘం సభ్యులు ప్రశ్నించారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలని డిమాండ్ చేశారు.

డ్రైనేజీకి మరమ్మతులు చేయండి

- తలకొండపల్లి కూడలిలో పగిలిన డ్రైనేజీ
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కడ్తాల్ కూడలి వద్ద ప్రమాదకరంగా డ్రైనేజీ పైకప్పు



డ్రైనేజీ పైకప్పు పగలడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిన దృశ్యం

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా ఐదేండ్ల క్రితం, మండల కేంద్రంలో రోడ్డు కిరువైపులా వర్షం నీరు వెళ్లేందుకు అప్పట్లో సంబంధిత అధికారులు డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే మండల కేంద్రం సమీపంలో తలకొండపల్లి కూడలి వద్ద డ్రైనేజీ పగలడంతో షాద్‌నగర్, తలకొండపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు లేరు. ప్రమాదాలు జరుగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని, డ్రైనేజీకి మరమ్మత్తులు చేపట్టాలని, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే రంగారెడ్డికి సమస్యలు వివరిస్తున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించి, మౌలిక సదుపాయలు కల్పించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కాలనీ వాసులు కోరారు. గురువారం పోచారం గ్రామానికి చెందిన ఇందిరమ్మ కాలనీ వాసులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీని గ్రామకంఠంగా మార్చాలని తెలిపారు. కొత్త వార్డుగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే రంగారెడ్డిని కోరారు. తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గొరిగే నర్సింహా, ఉపాధ్యక్షుడు శివకుమార్, అమర్నాథ్ అప్ప, శ్రీధర్, ఐలయ్య, సుధాకర్, రమేష్, జనార్ధన్, సత్తయ్య, రాజా, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత



ఆమనగల్లు: విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న లక్ష్మి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తండాలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ లక్ష్మీ కృష్ణనాయక్ విద్యార్థులకు యూనిఫాంలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివలీల, ఉపాధ్యాయురాలు లలిత పరమేశ్వరి, విద్యార్థులు, తండావాసులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, 14వ వార్డు కౌన్సిలర్ బొక్క రవీందర్ రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం బడిబాటలో భాగంగా ఇంజాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయంత్ రామ్, రంగా కృష్ణా గౌడ్, ఎండీ గౌస్ పాషా, నాయిని చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: విద్యతోనే ఉజ్జ్వల భవిష్యత్ ఉంటుందని మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ ముజిబర్ రహ్మాన్‌లు పేర్కొన్నారు. మండల పరిధిలోని వెల్జాల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో శ్రీనివాసుయాదవ్, రహ్మాన్‌లు పాల్గొన్ని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, లింగం, రజాక్, కార్యదర్శి శరత్, నాయకులు యాదయ్య, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో దంచి కొట్టిన వాన



ఇబ్రహీంపట్నంలో రోడ్డుపై పారుతున్న నీరు



మంచాలలో గాలివానకు కూలిన చెట్టు

ఇబ్రహీంపట్నం: వరుణదేవుడు ఒక్కసారిగా ఇబ్రహీంపట్నంపై విరుచుకుపడ్డాడు. గురువారం మధ్యాహ్నం 50 నిమిషాల పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఇక్కడ 27.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయింది. రోడ్లపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. పట్టణంలో మూడు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరాఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షపు నీటితోపాటు డ్రైనేజీలు నిండి రోడ్లపై ప్రవహించాయి. కుమ్మరికుంటలోని ఇళ్లలో, షాపుల్లోకి వాననీరు చేరింది.

స్పందించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్

వర్షంతో ఇబ్బందులు పడ్డ జనం మున్సిపల్ ఛైర్ పర్సన్ స్రవంతి, కమిషనర్ రవీంద్రసాగర్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. వారు దగ్గరుండి వరద నీరు, డ్రైనేజీలో నిలిచిన చెత్తా చెదారాన్ని తీయించారు. జేసీబీతో మున్సిపాలిటీ సిబ్బందితో ఎక్కడికక్కడ నీటిని మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. మ్యాన్ హోల్‌లో ఇరుక్కున చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు.

శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తా: ఛైర్‌పర్సన్ స్రవంతి

భారీ వర్షం కురిసినప్పుడల్లా కమ్మరికుంట తదితర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ ఛైర్ పర్సన్ కప్పరి స్రవంతి పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిదృష్టికి తీసుకెళ్తానన్నారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా బీరప్ప



యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన గొరిగే బీరప్ప బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. గురువారం జిల్లా అధ్యక్షుడు యాదీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా యాదీష్ మాట్లాడుతూ బీరప్ప గతంలో ఏబీవీపీ యాచారం మండల కన్వీనర్‌గా, రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించి విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటం చేశాడన్నారు. అనంతరం బీరప్ప మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్, దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా, బీజేపీ యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులను నియమించండి

మంచాల: ప్రభుత్వ పాఠశాలలో తక్షణమే పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం మంచాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాఠశాలలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా కార్మికులను నియమించాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలకు వచ్చే విద్యార్థులను స్వాగతం పలికే విధంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తువులు పంపిణీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు లేని చోట విద్య వాలంటీర్లను నియమించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

నేడు రాజ్‌భవన్‌లో రక్తదాతల దినోత్సవం

మనోరమ్మకు సన్మాన వేడుక

తలకొండపల్లి: హైదరాబాద్ రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు రక్తదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మనోరమ్మ 50 సార్లు రక్త దానం చేసింది. ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో ఉదయం 10 గంటలకు గవర్నర్ రాధాకృష్ణన్ మనోరమ్మకు సన్మానించనున్నారని అంజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల రక్త దాతలు, యువకులు అధిక సంఖ్యలో రాజ్‌భవన్‌కు తరలి వచ్చి రక్తం దానం చేయాలని ఆయన కోరారు.

మధుయాష్కిగౌడ్‌ను కలిసిన వైస్ ఎంపీపీ



మధుయాష్కిగౌడ్‌ను సత్కరిస్తున్న అనంతరెడ్డి

ఆమనగల్లు: పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డిలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

అంగన్‌వాడీ టీచర్లకు చీరలు పంపిణీ

మంచాల: అంగన్ వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ నర్మద, జెడ్పీటీసీ మర్రి నిత్య రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు చీరలు, మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు.

క్లుప్తంగా

టెస్కాబ్ వైస్ ఛైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ



సత్తయ్యను సత్కరించిన కురుమ సంఘం సభ్యులు

తుర్కయంజాల్: టెస్కాబ్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను పలువురు గురువారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తుర్కయంజాల్ కురుమ సంఘం సభ్యులు సత్తయ్య, సతీమణి మాజీ సర్పంచ్ కొత్తకుర్మ కళమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు వస్పరి బాబయ్య, ప్రధాన కార్యదర్శి గుండా నరసింహ, మాజీ అధ్యక్షుడు గుండా లింగమయ్య, డైరెక్టర్‌లు గుండా రాజు, బండారి బాబు, బంగి లక్ష్మమ్మ, మాజీ వార్డు సభ్యులు బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల సంచారంపై జాగ్రత్త

- సీఐ నర్సింహరావు

యాచారం: గ్రామాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా సంచరించే గుర్తు తెలియని వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహరావు పేర్కొన్నారు. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కర్తమేడిపల్లి, ఆకులామైలారం, మీరాఖాన్‌పేట, ముచ్చర్ల తదితర గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. రాత్రి పూట మందల్లో ఉన్న గొర్రెలు, మేకలను అపహరిస్తున్నట్లు ఫిర్యాదులు చేశారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే ఫిర్యాదులు చేయాలని ఆయన ప్రజలను కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యానికి మేలు

- ఎంపీపీ కొప్పు సుకన్య



మాట్లాడుతున్న ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లి, పిల్లల ఆరోగ్యం విషయంలో ఐసీడీఎస్ అధికారులు తగిన జాగ్రత్తలు సూచనలు చేయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు, చీరలు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, ఇతర ప్రోటీన్లు కలిగిన ఆహారపదార్థాలు చిన్నారులకు, గర్భిణి, బాలింతలకు ఎంతో మేలు కలిగించేవిగా ఉంటాయని తెలిపారు. ఐదేళ్లల్లోపు చిన్నారుల ఆరోగ్యం విషయంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



దొడ్లపహడ్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న ఏంఈఓ సర్దార్ నాయక్

మాడ్గుల: ఉపాధ్యాయులు తప్పనిసారిగా సమయపాలన పాటించాలని ఏంఈఓ సర్దార్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలో దొడ్లపహడ్‌తో పాటు ఆయా గ్రామల్లో ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య తక్కవగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోమరు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. బడులు ప్రారంభమైనందున ఉపాధ్యాయులు ఉదయం సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సత్కారం

ఆమనగల్లు: వైద్య విద్య ప్రవేశానికి నిర్వహించిన నీట్ పరీక్షలో ర్యాంకు సాధించిన మేడిగడ్డ తండాకు చెందిన విక్కిని తండావాసులు గురువారం ఘనంగా సత్కరించారు. నీట్ ర్యాంకర్ విక్కిని కేఎస్ఆర్ యువసేన జిల్లా నాయకులు విజయ్‌రాథోడ్, మల్లేశ్‌నాయక్, శంకర్‌నాయక్, రఘు, గోపిలు కలిసి ఘనంగా సత్కరించారు.